బంగారు ముంగిస

కౌరవ పాండవ యుద్ధం ముగిసిపోయిన పిమ్మట ధర్మరాజు చేసిన ఆ మహాశ్వమేధ యాగానికి నేల నాలుగు చెరగులనించి రాజులు, సామంతులు, మహీసురులు, ఋషీశ్వరులు, ఋత్విక్కులు మొదలైన వారంతా వచ్చి ఆ యజ్ఞం యావత్తూ కళ్లారా చూచి ఆనందించారు. అవభృథ స్నానం జరిగిన పిమ్మట వారంతా మంగళ తూర్యాల ఘోషలో ధర్మపుత్రుని శిరస్సుమీద ఆశీస్సులతోబాటు అక్షతల వర్షం కూడా కురిపించారు!

సభా మండపంలో సింహాసనాసీనుడై ఉన్న ఆ ధర్మమూర్తి నందరూ అనేక విధాలుగా ప్రశంసించారు. అంతటి మహాశ్వమేధయాగము, అంతటి వితరణ, అలాంటి బ్రాహ్మణ సమారాధన ఎన్నడూ కని విని ఎరగమన్నారు వారంతా! ఆ విధంగా దిగ్విజయంచేసి ఆ ధనరాసులన్నీ ఆ రీతిగా ఆ యజ్ఞంలో నిశ్శేషంగా వితరణ చెయ్యడమనేది ఆ ఒక్క ధర్మమూర్తికే చెల్లిందనీ, బలి, దధీచి మొదలైనవారి దానతత్పరత కూడా ఆ వితరణ ముందు ఎందుకూ కొరగాదనీ వారంతా ముక్తకంఠాలతో ఉద్ఘోషించారు! పిమ్మట మంగళతూర్యాలు దిక్కులు పిక్కటిల్లేటట్లు భోరుమని మారు మోగాయి!

ఇంతలో ఆ సభా మధ్యంలో ఒక్క సారిగా ఉవ్వెత్తుగా కలకల హాసం చెలరేగింది! ఆ నవ్వు మానవుని నవ్వులా వినిపించలేదు! అది ఏదో విచిత్రమైన కల కల నవ్వు. సభలోని వారంతా నిర్ఘాంతపోయి సభామధ్య వేదికకేసి రెప్పపాటు లేకుండా చూచారు. ఆ నవ్వు అంతకంతకూ శ్రుతి మించిపోయింది. నిశ్చలంగా, నిశ్శబ్దంగా ఉన్న సభలో ఆ కల కల హాసం తప్ప మరేవిధమైన ధ్వనీ వినిపించలేదు!

ఆ సభా మధ్యలో ఒక ముంగిస వెనక కాళ్ళమీద నిలబడి అదే పనిగా నవ్వుతూంది! దాని శరీరం, శిరస్సు మొదలు నడుంవరకూ, అంతా బంగారమే! మిగిలిన సగమూ సామాన్యంగానే ఉంది! ఆ విచిత్రం చూచి

అందరూ ఆశ్చర్యపోయారు! దాని బంగారు శరీరం కాంతులు సభా మండపంలో అంతటా అగ్నిజ్వాలల్లా వ్యాపిస్తున్నాయి. ఆ ముంగిస గుక్క తిప్పుకోకుండా ఇంకా అలాగే నవ్వుతూంది!

ఆ సభలో కొందరది ఏదో మహాప్రళయ సూచనేమో అనుకున్నారు. మరికొందరది గొప్ప అరిష్టసూచకమని, వెంటనే ఆ అరిష్టశాంతి చేయించాలని అన్నారు. ఇంతలో ఆ బంగారు ముంగిసే ఆ సభాస్తారుల నుద్దేశించి ఇలా అన్నది:

"ఆహా! ఏమి మీ పొగడ్తలు! ఈ పొగడ్తలాలకిస్తూంటే నోరూ వాయీ లేని నాకు కూడా లోలోపల నవ్వు, మాటలు పొంగి పొంగి పైకి వస్తున్నాయి!" అని ఆ ముంగిస మళ్ళీ కలకలా నవ్వింది! సభ్యులెవరికీ ఊపిరి కూడా ఆడడంలేదు! ఆ ముంగిస తన నవ్వంతా అతి కష్టంమీద తమాయించుకుని తిరిగీ ఇలాగన్నది:

"మీరంతా ఈ యాగము, ఈ దాన ధర్మాలు చూచి కేవలం వందిమాగధుల లాగ కైవారాలు చేస్తున్నారు! కాని ఒక్క బక్క చిక్కిన బీద బ్రాహ్మణుని వితరణ కాలి గోటికి కూడా ఇది సరిపోలదు! ధర్మరాజు బ్రహ్మణ్యుడే! ఆయన అశ్వమేధయాగము అంతటిదే! కాని ఆ బ్రాహ్మణుని వితరణకు, దీనికి హస్తిమశకాంతరం! కొంచెం ఆలకిస్తే ఆ విషయం మీకే విశదం కాగలదు. దయచేసి సావధాన చిత్తాలతో చిత్తగించండి!"

పిమ్మట ఆ ముంగిస ఆ బ్రాహ్మణుని త్యాగవృత్తాంతం అంతా చెప్పింది. సభాస్తారులంతా చిత్రప్రతిమల్లా నిశ్చేష్టులై అది విన్నారు.

"ఆహా! కురుక్షేత్రంలో ఆ సక్తుప్రస్థుడెంతటి మహానుభావుడు! ఆ బ్రాహ్మణుడు వరిచేలల్లో రాలిన ధాన్యంగింజ లేరుకుని అవి దంపించి ఆ వరిపిండితోనే జీవితం గడుపుకొనేవాడు. ఆయన భార్య, కుమారుడు, కోడలు కూడా అన్ని విధాలా ఆయనకు తలలో నాలుకలా మసులుకొనేవారు. ఒక నాటికి సరిపడిన ధాన్యంగింజల కంటె వారు ఒక్క గింజకూడా ఎక్కువగా తెచ్చేవారు కారు! ఆ సక్తుప్రస్థుడు మహా తపశ్శాలి. తనకు కలిగిన దానితోనే తన కుటీరానికి వచ్చిన అతిథులను అభ్యాగతులను ఎంతో ఆప్యాయంగా సంతృప్తి పొందించేవాడు!

ఇలాగ ఉండగా కొంత కాలాని కొక ద్వాదశవర్ష క్షామం వచ్చింది. ఆ క్షామంలో ఎన్నెన్నో జీవరాసు లన్నంలేక హాహా కారాలు చేశాయి. ఒక సంవత్సరమా, రెండు సంవత్సరాలా! అది పన్నెండేళ్ళ కరువు! ఆ కరువులో ఎందరెందరో 'అన్నమో రామచంద్రా' అని ఆక్రందిస్తూ అలాగే ప్రాణాలు విడిచారు!

పాపం! ఆ క్షామంలో ఆ సక్తుప్రస్థుడు, ఆయనకుటుంబము ధాన్యం గింజలు దొరకక ఎన్నెన్నో కటికి ఉపవాసాలు చేసేవారు. అయినా ఒక్కనాడూ వారు రేపటికని చెప్పి ఒక్క గుప్పెడు ధాన్యం గింజలు కూడా నిలవచెయ్యలేదు! ఆ బ్రాహ్మణుడు ఆ ఉంఛవృత్తి అలాగే అసి ధారావ్రతంగా పాలించేవాడు! ఆహా! ఏమి ఆ మహానుభావుని ధర్మనిరతి!

ఆ కరు వలాగే పెద్ద వడగాళుపులాగ ప్రాణులన్నిటిని మలమల మాడ్చివేసింది. ఆ సక్తుప్రస్థుని కుటుంబం వారంతా చాలాకాలం ఆహారంలేక బక్కచిక్కి పోయారు! అయినా వా రెవరినీ నోరుతెరిచి అన్నం అర్థించలేదు! అలాగే పొలాల్లో రాలిన ధాన్యం గింజ లేరుకుంటూ వాటితోనే జీవించేవారు. అలాగ కొన్నాళ్ళపాటు ఒక్కొక్కటిగా ధాన్యం గింజలు సేకరించగా సేకరించగా కొంతకాలాని కవి మానెడు గింజ లైనాయి. వా రొకనాడు ఆ గింజలన్నీ దంచి పిండిచేసుకున్నారు. ఆ పిండి నలుగురూ నాలుగు సమానభాగాలు చేసుకున్నారు. సక్తుప్రస్థుడు స్నాన సంధ్యాదులు నిర్వర్తించుకొని తన భాగం ఆరగించవలెనని అనుకొన్నాడు.

అంతలో ఆయన కనతిదూరంలో ఒక అతిథి కనిపించాడు. అప్పటి కప్పుడే రెండు యామాల కాలం గడిచిపోయింది! ఎండ వేడిమికి తాళలేని కాకులు కావు కావని అరవడానికి కూడా శక్తిలేక సన్నంగా దీనంగా అరుస్తున్నాయి.

ఆ అతిథి కుటీరాని కల్లంత దూరంలో ఉండగానే సక్తుప్రస్థు డాతని కెదురేగి ఎంతో ఆప్యాయంగా లోపలికి తీసుకు వచ్చాడు. అర్ఘ్య పాద్యాదులతో అనేక విధాలుగా సత్కరించి ఆయనకు తన భాగం వడ్డించవలసిం దని గృహిణితో అన్నాడు.

ఆ అతిథి అది ఆరగిస్తూంటే ఆ సక్తుప్రస్థు డెంత బ్రహ్మానందభరితు డైనాడు! ఆ అతిథి ఆ సక్తుప్రస్థుని భాగం ఆరగించి వేసినాడు. అయినా అతిథి ముఖంలో ఆకలి తీరిన కళ లేమీ కనబడలేదు! పాపం! సక్తుప్రస్థు డది చూచి కొంచెం దిగులు పడ్డాడు.

అంతలో ఆయనభార్య సక్తుప్రస్థుని లోపలికి పిలిచి తన భాగం కూడా ఆ అతిథి దేవుని కర్పించవలసిందని కోరింది!

ఆయన దాని కంగీకరించలేదు.

"నిన్ను పోషించవలసినది నేనేగదా! మరి నీ ఆహారం నేనెలాగ స్వీకరించగలను!" అన్నాడు.

"మీ అర్థాంగి కీ ఆతిథ్యధర్మంలో పాలు పంచకపోవడం ధర్మం కాదు!" అన్నది ఆ బ్రాహ్మణుని ధర్మపత్ని!

సక్తుప్రస్థుడు దాని కేమీ సమాధానం చెప్పలేక పోయినాడు. ఆమెభాగం కూడా ఆ అతిథికి అర్పించివేశాడు. తిరిగీ ఆ అతిథి ఆ భాగం కూడా తినివేశాడు. కాని అతనికి ఆకలి తీరలేదు! సక్తుప్రస్థునికి ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు! అయ్యో! ఒక్క క్షుధార్తునికి కడుపు నిండా ఇంత అన్నం కూడా పెట్టలేక పోయానే! అని లోలోపల ఎంతో బాధ పడ్డాడు.

అంతలో ఆ బ్రాహ్మణుని కుమారుడు తన భాగం కూడా ఆ అతిథికి వడ్డించవలసిందని తల్లితో చెప్పాడు. తల్లి ఒక్క క్షణం కూడా ఆలస్యం కాకుండా ఆ పిండి అతనికి వడ్డించింది. అది తిన్న తరవాత ఆ బ్రాహ్మణుడు కొంత సేదదేరినట్లు కనిపించాడు! సక్తుప్రస్థుడు అది చూచి కొంచెం సంతోషించాడు.

సక్తుప్రస్థుని భార్య ఎంతో ఆప్యాయంగా ఆ అతిథితో 'బాబూ!' ఇంకా కొంచెం తీసుకోండి!" అన్నది. అతిథి అంటీ అంటనట్టుగా అక్కర్లేదనబోయి ఇంకా కొంచెం కావా లన్నాడు.

ఆమె తన అలవాటు ప్రకారం అన్నదేగాని కుటీరంలో ఇక ఒక్క కోడలు భాగం తప్ప మరి వేరే ఆహార మేమీ లేదని ఆమెకు తెలియదు! కాని ఏమి చెయ్యడానికీ పాలుపోక లోపలికి వెళ్ళిపోయింది! ఆ గృహస్థు

కూడా లోపలికి వెళ్ళాడు! అంతలోనే కోడలు తన భాగం కూడా తీసుకు వచ్చి అత్తగారి కందీయబోయింది! ఆమె కొంతసేపు అది వద్దనడానికి గాని, స్వీకరించడానికి గాని శక్తిలేక అల్లాగే కొయ్య బొమ్మలా నిలబడి పోయింది! లోపలికి వచ్చిన సక్తుప్రస్థుని కా సంఘటన చూచేసరికి కళ్ళనీళ్ళు తిరిగాయి. పాపం, కోడలు ఆకలితో నీరసపడి ఉన్నా తన భాగం కూడా అతిథి కీయవలసిందని అత్తగారిని అనేక విధాలుగా ప్రాధేయపడింది! మరి గత్యంతరం లేక ఆమె ఆ భాగం కూడా అతిథికి అర్పించి వేసింది! ఆ బ్రాహ్మణుడు ఆ భాగంలో కూడా చాలా వరకు ఆరగించి వేశాడు! తృప్తిగా మంచి తీర్థం లోపలికి పుచ్చుకుని గర్రున తేన్చాడు. ఎంత బలవంతం చేసినా ఇక మిగిలిన ఆహారం అక్కర లేదని పరిహరించి వేశాడు!

అతిథి కా విధంగా తృప్తి కలిగిందిగదా అని ఆ సక్తుప్రస్థుడానాడెంతగా సంతోషించాడు! ఆ అతిథి బ్రహ్మానందపడి వారందరినీ ఆశీర్వదించి ప్రశాంతంగా ఇలాగన్నాడు:

“సక్తుప్రస్థా! నీ వంటి మహానుభావు డీలోకంలో అవతరించడం వల్లనే సూర్య చంద్రాదులు గతి తప్పకుండా తమ తమ మార్గాల్లో సంచరిస్తున్నారు! మీ వితరణ చూచి మిమ్మల్ని అందరినీ విమానంలో దివ్యలోకానికి తీసుకుపోవాలనే తహతహతో దేవత లాకాశంలో వేచి ఉన్నారు! అదిగో! ఆకాశంలో ఎంతమంది దేవతలు ఆశ్చర్యమగ్నులై నిశ్చలంగా నీకోసం నిరీక్షిస్తున్నారో చూడు!”

నేనా సంఘటన అంతా చూస్తూ ఆ ప్రాంతాల్లో సంచరిస్తున్నాను. ఆనందం పట్టలేక ఆ అతిథికి కాళ్ళు కడిగిన నీటిలో అటూ ఇటూ తిరిగాను! చిత్రంగా నా శరీరంలో సగం భాగం సువర్ణమయమై తళతళా మెరిసింది. ఆహా! ఆ సక్తుప్రస్థుని త్యాగము, ఆ కుటుంబం ధర్మనిరతి తలుచుకుంటూంటే నా కిప్పటికీ శరీరం గగుర్పొడుస్తూనే ఉంది! అప్పటి నించీ నా మిగిలిన శరీరం అంతా సువర్ణమయమై పోగలదనే ఆశతో ఎన్నెన్నో యజ్ఞయాగాలు సందర్శించాను. ఆయా మహారాజులు, చక్రవర్తులు అవభృథ స్నానాలు, దానాలు చేసిన నీటిలో నా శరీరం తడిపాను! కాని నా ప్రయాస ఫలించలేదు.

పిమ్మట కొంతకాలానికి ధర్మదేవత మూర్తీభవించిన ధర్మరాజే అశ్వమేధ యాగం చేస్తున్నా డనే శుభవార్త నా చెవులబడింది. నే నెంతో ఆనందించాను! నా ప్రయాస ఈనాటికి ఫలించగలదని అనుకున్నాను.

ధర్మరాజు మహానుభావుడు. ఆయన చేసిన అశ్వమేధ యాగం వంటి మహత్తర యాగం నే నెన్నడూ దర్శించలేదు! ఈ యాగంలో ఏ విధమైన లోపమూ లేకుండా సమస్తమూ సలక్షణంగా జరిగిపోయింది! బ్రాహ్మణు లన్నమాటేమిటి? సమస్త ప్రాణులూ ఈ యజ్ఞంలో తృప్తి దీరా భుజించారు! ఈ మహాయాగంలో వేలెత్తి చూపడాని కేలోపమూ లేదు! ఇంతమంది మహా తపస్సంపన్ను లీ విధంగా స్తోత్రం చేసిన ఈ యజ్ఞము, ఈ వితరణ నిశ్చయంగా మహత్తరమైనవనే నని నేను విశ్వసించాను.

ఆ విశ్వాసంతోనే ఈ యజ్ఞశాల అంతటా తిరిగాను. కాని ఎంత తిరిగినా మిగిలిన శరీరం బంగారం కాలేదు! పైగా ధూళిధూసరితమై పోయింది! అంతే! అవభృథస్నానం చేసిన ఈ మహారాజు అడుగు జాడల్లో సంచరిస్తే నా శరీరం అంతా బంగారం కాగల దేమో అని చాలా చాలా ఆశించాను. ఇంకా యజ్ఞశాలలో అనేక విధాలుగా ప్రయత్నించాను. కాని నా కోరిక సఫలం కాలేదు!

అప్పటినించీ ఆ సక్తుప్రస్థుని చరిత్ర నా హృదయంలో అలాగే మెరుస్తూంది! ఆ మహాత్యాగం ముందీ యుధిష్ఠిరుని దానధర్మా లేపాటివి? కనుక నే ఇక్కడ నా శరీరం మరి సువర్ణం కాలేదు. అయ్యో! ఈ మిగిలిన శరీరం బంగారం కాలేదే అని నే నెంతో కించపడుతూంటే మీమీ హాహాకారాలు వినిపించాయి. అవి వింటూంటే పెద్ద నవ్వు వచ్చింది. ఆ లోలోపలి నవ్వాగక నిండు సభలో మీ అందరి ఎదట ఆ విధంగా నవ్వాను! మరి నాకు సెలవు దయచేయించండి!"

ముంగిస ఆవిధంగా అనర్గళంగా ప్రసంగిస్తున్నంతసేపూ సభ సభ అంతా చిత్రప్రతిమలా మారిపోయింది. ఆ ముంగిస ఆ విధంగా ప్రసంగించిన తరవాత మరి ఎవరు మాత్రం ఏమనగలరు!

అది అలాగని వెళ్ళబోతూంటే ఒక వృద్ధసదస్యుడు లేచి నిలబడి దానితో ఇలాగన్నాడు:

"ధర్మపుత్రుని అశ్వమేధయాగం అన్ని విధాలా సలక్షణంగా జరిగిపోయిందని నీవే అన్నావు గదా! అయితే సక్తుప్రస్థుని వితరణముందు ఈ యాగము, ఈ వితరణ - నీ వింతగా కించపరచడానికి హేతు వేమిటి?"

దానిమీద ఆ ముంగిస మళ్ళీ ఒక్కసారి కలకల నవ్వింది:

"ఈ సభలో ఇంతమంది బ్రహ్మణ్యులైన ధర్మవేత్త లున్నా - ఈ చిన్న ధర్మసందేహం కూడా నేనే తీర్చవలెనా?" అన్నది.

సభలోని వారంతా తిరిగి ఏమనడానికీ పాలుపోక అలాగే నిర్ఘాంత పోయారు. మరి కొందరు తలలే వంచేసుకున్నారు! ధర్మరాజాదు లందరూ ఖిన్నులై దిగాలుపడిపోయారు! కొంద రొకరి మొహా లొకరు చూచు కొన్నారు!

ఆ ముంగిస ఒక్క నిమిషం ఊరుకుని తిరిగీ ఇలాగన్నది!

"శత్రువులను సంహరించి, ఈ ధర్మప్రభువు దిగ్విజయం చేసి, ఆ హింసార్జితమైనద్రవ్యంతో ఈ అశ్వమేధయాగం జరిపించాడు. యజ్ఞంఎంత సలక్షణంగా జరిగినా హింసాద్రవ్యం హింసాద్రవ్యమే కదా! ఆసక్తుప్రస్థుని ఐహికచర్య సమస్తమూ అహింసామయంగానే సాగిపోయింది! అందువల్లనే ఆయనవితరణ యజ్ఞంముందు ఈ అశ్వమేధయాగం ఎందుకూ కొరగాకుండా వెలవెల బోయింది! ఇంతటి అల్ప విషయం కూడా ఈ ధర్మ సంస్థానం లోని ధర్మవేత్త లెవరికీ స్ఫురించలేదంటే నాకు మళ్ళీ ఉవ్వెత్తుగా నవ్వు వస్తూంది!" అని చెప్పి ఆ ముంగిస తిరిగీ అదే పనిగా కలకలా నవ్వడం మొదలు పెట్టింది! ఈసారి ముంగిస శరీర కాంతులేకాక, నవ్వు వెలుగులు కూడా ఆ సభాస్తంభాల మీద చిత్ర చిత్రంగా ప్రతిఫలించాయి. అందరూ శిల్పప్రతిమల లాగా ఆ నవ్వుల సవ్వడులు విన్నారు.

ఆ వింత వింత వెలుగులలో ఏకమైపోతూ ఆ ముంగిస అలాగే, అక్కడే అదృశ్యమై మాయమైపోయింది!

—o—